



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సర్వేయర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరుపై ఆరాతీశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగిన గ్రామపాలన అధికారి పరీక్షకు 60 మంది అభ్యర్థులకు గాను 46 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు ఉదయం పరీక్ష 10గంటల నుంచి 1గంట వరకు జరిగింది. ఈ పరీక్షకు 305 మంది అభ్యర్థులకు గాను 271 మంది హాజరయ్యారు. 44 మంది గైర్హాజరైయ్యారు. లైసెన్స్ సర్వేయర్ రెండో పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరిగింది. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



జాలువారుతున్న జలపాతం

- సిర్నాపల్లికి తరలివస్తున్న పర్యాటకులు

మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో సిర్నాపల్లి జలపాతం జాలువారుతోంది. సిర్నాపల్లికి రెండు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవి ప్రాంతంలో ఏర్పడిన వాటర్‌ఫాల్స్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. కుటుంబ సమేతంగా ఇక్కడికి చేరుకుని జలపాతపు వద్ద సందడి చేస్తున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. కాగా, జలపాతం వద్ద సరైన సౌకర్యాలు లేక దూరప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కట్లు పడుతున్నారు. - ఇందల్వాయి (ఆంధ్రజ్యోతి)



గోదావరి పరవళ్లు

- యంచ వద్ద భారీగా నీటి ప్రవాహం

మండలంలోని యంచ గోదావరిలో ఆదివారం సాయంత్రం భారీ నీటి ప్రవాహం పెరిగింది. ఎగువన మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటి మట్టం పెరిగింది. దీంతో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. అలాగే రెంజల్ మండలంలోని కందకుర్తికి జలకళ సంతరించుకుంది. ఎగువ గోదావరి ప్రాంతం విష్ణుపురి, బాబ్లీ నుంచి వరద రావడంతో గోదావరికి నీటి మట్టం పెరిగింది. శివాలయం సగం వరకు నీట మునిగింది. - నవీపేట్/రెంజల్ (ఆంధ్రజ్యోతి)



ఎస్సారెస్పీకి వరద ఉధృతి

- ప్రాజెక్టులోకి 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 50503 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ఉదయం 10484 క్యూసెక్కుల వరద నీరు చేరగా క్రమంగా మధ్యాహ్నం వరకు 24500 క్యూసెక్కుల వరద పెరిగింది. సాయంత్రానికి ప్రాజెక్టులోకి 50503 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 80.5 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి 1070.30 అడుగులు 24.806 టీఎంసీల నిల్వ ఉందని అధికారులు తెలిపారు. - మెండోర (ఆంధ్రజ్యోతి)

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పదేళ్లలో ఇవ్వని రేషన్ కార్డులను 18 నెలల్లో అందించాం
- ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి : ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



రైతువేదికలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లోనే అర్హులకు రేషన్ కార్డులను అందించిందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికే రేషన్ కార్డులను మంజూరు చేయాలని, భూమి ఉన్న వారికి ఉద్యోగస్థులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మండలంలో దాదాపు 400 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, బేస్‌మెంట్ వరకు నిర్మించిన వారికి లక్ష రూపాయలను కూడా అందించామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణం అందించామన్నారు. వానాకాలం దృష్ట్యా గ్రామంలో వర్షపు నీరు నిలువకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధన్ నియోజకవర్గ పరిధిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని స్థాపించాలనే ఆలోచన చేస్తున్నామని, రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ దత్తాత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్‌హందాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు నగరంలో పీసీసీ చీఫ్ పర్యటన

నిజామాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సోమవారం నగరంలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పలు కార్యక్రమాలలో వారు పాల్గొననున్నారు. ఉదయం మారుతి నగర్‌లో వన మహోత్సవంలో మొక్కలు నాటనున్నారు. అనంతరం జెండాబాలాజీ మందిరం కమిటీ ప్రమాణస్వీకారం, 11గంటలకు శంభునిగుడి ఆలయ ప్రమాణస్వీకారం, 11.30 గంటలకు హమాల్‌వాడి సాయిబాబా ఆలయ ప్రమాణస్వీకార కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. అనంతరం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నిజామాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రేంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచ వద్ద గోదావరి వరద ప్రవహిస్తోంది. కందకుర్తి వద్ద శివాలయం నీటమునిగింది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. జిల్లా అంతటా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నవీపేటలో 51.3, డొంకేశ్వర్‌లో 50, నందిపేటలో 42.3, రేంజల్‌లో 42 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లాలో 33 మండలాలకు గాను 12 మండలాలలో లోటు వర్షపాతం ఉండగా 21 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

- మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అక్షరాస్యత వైపు అతివలు

- స్వశక్తి మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను అక్షర్యాసులుగా మార్చే ప్రయత్నం
- ఉల్లాస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- జిల్లాలో 59,049 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం

మండలాల వారీగా మహిళా సంఘాల సభ్యుల వివరాలు ఇలా..

మండలం	సభ్యులు	నిరక్షరాస్యులు	పదో తరగతిలోపు	పదో తరగతి	ఇంటర్	డిగ్రీ, ఆపైన
ఆర్మూర్	11,821	5,331	2,713	1895	808	649
బాల్కొండ	7,909	2,174	1161	906	383	273
భీంగల్	13,128	1051	502	315	168	106
బోధన్(ఎంఎస్-1)	7,785	2,523	2,331	842	383	365
బోధన్(శాంతి)	7,293	599	425	192	128	86
చందూర్	2,474	841	372	231	147	107
ధర్పల్లి	10,219	1629	843	641	307	198
డిచ్‌పల్లి	14527	2030	1140	1017	562	304
ఇందల్వాయి	8815	1150	598	412	182	65
జక్రాన్‌పల్లి	9936	830	473	438	170	178
కమ్మర్‌పల్లి	10016	2709	1606	1144	565	424
కోటగిరి	10306	2098	1825	638	293	186
మాక్లూర్	12544	4393	2364	1731	785	578
మెండోరా	6171	525	283	284	80	81
మోర్తాడ్	8088	15	18	12	11	8
మోస్రా	3428	43	30	13	5	6
మోపాల్	9791	3089	1745	1177	541	255
ముప్కాల్	5029	1097	573	555	215	222
నందిపేట్	15030	3551	3035	1724	994	545
నవీపేట్	14065	2792	3737	1668	902	564
నిజామాబాద్ రూరల్	7452	2623	1481	895	453	368
రేంజల్	8837	366	246	94	53	17
రుద్రూర్	5109	448	304	131	78	46
సిరికొండ	11309	3826	1780	1054	631	454
వర్ని	828	9	1	4	1	0
వేల్పూర్	11504	900	520	463	201	130
ఎడపల్లి	10523	1520	2229	980	509	392
ఏర్గట్ల	3923	1196	827	553	191	126
మొత్తం	**247860**	**49358**	**33162**	**20009**	**9751**	**6733**

నిజామాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చదువుకోకుండా స్వశక్తి మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సెర్ప్, విద్యాశాఖ సంయుక్తంగా ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అతివలను అక్షరాస్యులుగా మార్చే దిశగా ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న నిరక్షరాస్యులను గుర్తించే పనిలో డీఆర్‌డీవో, వయోజన విద్యాశాఖ అధికారులు ఉన్నారు. మహిళా శక్తి సంఘాలలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి ముందుగా వారికి అక్షరాస్యులుగా మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మహిళాసంఘాలలో ఎంత మంది సభ్యులు ఉన్నారు. వారి చదువు వివరాలు, నిరక్షరాస్యులు, మహిళా సంఘాల సభ్యుల పిల్లల వివరాలను డీఆర్‌డీవో అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఉల్లాస్ ప్రత్యేక కార్యక్రమం ద్వారా మొదటి విడతగా జిల్లాలో 59,049 మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 3 టీచర్లకు మొదట రాష్ట్రస్థాయి శిక్షణ తర్వాత వారు మండలానికి ముగ్గురు టీచర్లకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ పొందిన వారు గ్రామస్థాయిలో ఉపాధ్యాయులకు వారు నిరక్షరాస్యులైన మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

2లక్షల 47వేల 560 మంది సభ్యులు

జిల్లాలో 25వేల 170 మహిళ స్వశక్తి సంఘాలు ఉండగా 2లక్షల 47వేల 560 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని రూపొందించారు. క్షేత్రస్థాయిలో వీరికి వీవోఏలు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో 806 మంది వీవోఏలను గుర్తించారు. ఇప్పటికే జిల్లాలో మండలాల వారీ గా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు లక్షా 19వేల 280 మంది మహిళ సంఘ సభ్యుల వివరాలను సేకరించారు. వీరిలో 49358 మంది నిరక్షరాస్యులుగా గుర్తించారు. వివరాల సేకరణ కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. మహిళా సంఘాల సభ్యులు చదివిన తరగతుల వివరాలతో పాటు నిరక్షరాస్యులైన సభ్యుల వివరాలను, వారి పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. పదో తరగతి పాసైన వారికి ఓపెన్ ఇంటర్ ద్వారా ఇంటర్ పూర్తి చేసేలా, ఇంటర్ పూర్తయిన వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు మహిళా సంఘాల సభ్యుల పిల్లలలో 5,799 మంది వికలాంగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

చదువు నేర్పించడం వల్ల ఎంతో మేలు..

:ప్రశాంతి, సంఘ సభ్యురాలు, (గంగరమంద)



నేను 7వ తరగతి వరకు చదువుకున్నాను. ఇప్పుడు మహిళా సంఘ సభ్యులకు ఉన్నత చదువు కోసం అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. దీనివల్ల ఇప్పుడు ఉన్నత చదువులు చదివే అవకాశం నాకు దక్కింది. 10వ తరగతి, ఆ తర్వాత ఇంటర్ చదవాలనే ఆసక్తి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మహిళలకు ఉన్నత చదువులు చదివే అవకాశం దక్కుతుంది.

ప్రభుత్వ నిర్ణయం ఎంతో గొప్పది..

: పుష్పలత, పోచమ్మగలి



నేను 5వ తరగతి వరకు చదివాను. ఈ కార్యక్రమం ద్వారా ఉన్నత చదువులు చదవాలనుకుంటున్నాను. చదువురాని మహిళలకు చదువు నేర్పించాలనే ఉల్లాస్ కార్యక్రమం ఎంతో గొప్పది. వంటింటికే పరిమితమై చదువును మధ్యలో ఆపేసిన వారు ఇప్పటి వరకు చదువుకోని వారికి ఈ కార్యక్రమం ద్వారా ఉన్నత చదువులు, చదువు నేర్చుకునే అవకాశం దక్కడం అభినందనీయం.



మాట్లాడుతున్న బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్

ఐక్యతతోనే బంజారాల అభివృద్ధి సాధ్యం

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

డిచ్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే బంజారాలు అభివృద్ధి సాధిస్తారని త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బంజారా సంఘం నాయకులు, కార్యకర్తలందరు కలిసి కదలాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బర్దిపూర్ శివారులో గల బృందవనం గార్డెన్‌లో నిర్వహించిన బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తాను గత ప్రభుత్వంలో కేసీఆర్‌తో కొట్లడి గిరిజన తండాలను, పంచాయతీలుగా చేయించానన్నారు. సేవాలాల్ మహరాజ్ చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. గిరిజన తండాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 500 కోట్లు కేటాయించారని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ సోయం బాబురావు కుట్రలు తిప్పి కొట్టడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని రాములు నాయక్ సూచించారు. బంజారాలు అన్ని రంగాల్లో రాణించాలని ఆల్ ఇండియా బంజార సంఘ్ జాతీయ అధ్యక్షుడు మాజీ ఎంపీ ఉమేశ్ జాదవ్ అన్నారు. కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలలో ముగ్గురు బంజారా మంత్రులు ఉన్నారని తెలంగాణలో కూడా బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహరి నాయక్, రాష్ట్ర సలహాదారులు కిషన్ సింగ్, గౌరవ అధ్యక్షుడు రామారావు, జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో దుబ్బ పాఠశాల

- 400 మంది విద్యార్థులకు నాలుగు టాయిలెట్లే
- చిన్న వర్షానికే చెరువును తలపిస్తున్న పాఠశాల మైదానం
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల మైదానంలో నిలిచిన వర్షపు నీరు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుబ్బ హైస్కూల్ సమస్యల వలయంలో చిక్కుకుంది. పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నా కనీస సౌకర్యాలు కనిపించడం లేదు. మౌలిక సదుపాయాల కోసం విద్యార్థులు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పాఠశాలలో కేవలం నాలుగు టాయిలెట్లు మాత్రమే ఉండటంతో మూత్రవిసర్జన కోసం విద్యార్థులు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల పక్కన రాత్రి సమయంలో మందు బాబులు సీసాలు పారవేస్తున్నారు. వీటితో పాటు మధ్యాహ్న భోజనం సైతం ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పెట్టడం లేదు. ఉడకని అన్నం వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. తరగతి గదులల్లో లైట్లు, ఫ్యాన్‌లు లేవని అధికారులు వీటిపై దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే పాఠశాల మైదానం చెరువును తలపిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వర్షపునీరు స్కూల్ మైదానంలో చేరి విద్యార్థులు తరగతి గదులకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని, పాఠశాల నిర్వాహణను ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య పట్టణ సంఘం అనుబంధ సంఘాల విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1944లో స్థాపించిన ఆర్యవైశ్య సంఘానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. అన్నదాన కార్యక్రమాల నుంచి విద్య, వైద్యం, ఆధ్యాత్మికంగా అన్ని రంగాల్లో సేవలు అందించడంలో ముందుంటారని అన్నారు. ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత పథకాల్లో కూడా మన సేవ ఉందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రవర్ణంలో ఉన్న పేదల గురించి ఆలోచించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీకి బీజేపీకి దక్కుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మాట్లాడుతూ నూతనేంగా గెలిచిన సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు.

కార్యక్రమం పేరులో మార్పు

నగరంలో పోటాపోటీగా జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ప్రత్యర్థి ప్యానల్ కోర్టును ఆశ్రయించడంతో మొదట ప్రమాణస్వీకారంగా నిర్వహించాలనుకున్న కార్యక్రమాన్ని నిర్వాహకులు ఆత్మీయ సమ్మేళనంగా మార్చినట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకారం పేరు పెడితే ఎక్కడ న్యాయపరమైన చిక్కులు వస్తాయోనని ముందు జాగ్రత్తగా ఆత్మీయ సమ్మేళనం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తి, శ్రద్ధలతో హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నందిపేటలోని భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నందిపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని లేదంటే అధర్మం పెరిగిపోతుందని ఆర్మూర్ ఎమ్మెల్యేపైడి రాకేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం నందిపేట మండల కేంద్రంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమంలో వ్యవస్థాపకులు శ్రీమంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన మండపం నిర్మాణానికి వివిధ ఆశ్రమాల మహరాజ్‌లతో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ దాదన్నగారి విఠల్ రావులు వేర్వేరుగా భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ హిందూవులుఐక్యత, బాధ్యతతో మెలిగినప్పుడే దేశం బాగుంటుందని తెలిపారు. హిందూవుగా ఆశ్రమానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆశ్రమాలు ఉండటం హిందూ జాతికి ఎంతో ముఖ్యమని, ధర్మంతో దేవుళ్ళను కొలవాలని, అప్పుడే మనమందరం ఐక్యతతో ఉంటామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యాన్నదానం సత్రం నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.21లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా ఎల్‌వీ ప్రసాద్ హస్పిటల్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంటి పరీక్షల ఖర్చుల నిమిత్తం రూ.లక్ష విరాళంగా ఇస్తున్నట్లు వినయ్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ ఛైర్మెన్ దాన్నగారి విఠల్ రావు, వివిధ పార్టీల నాయకులు, స్వామీజీలు, భక్తులు తదితరులు ఉన్నారు.

వృద్ధులను ఆదరించి గౌరవించాలి: ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను ఆధరించి గౌరవించాలని వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులు తోడు నీడగా నిలవాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మామిడిపల్లి లో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో వృద్ధులకు చేతికర్రలు, గుర్తింపు కార్డులు అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు మామిడిపల్లిలో భవనాన్ని ఏర్పరుచుకోవడం అభినందనీయమన్నారు. ఈ వయస్సులో వారు ఏదో వ్యాధితో బాధపడుతుంటారని కుటుంబ సభ్యులు సరిగా చూడకుండా ఇబ్బందులకు గురిచేస్తే డయాల్ 100కుఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల పోశెట్టి, రాంమూర్తి, ఫోరం కార్యదర్శి వెల్మల నడ్పిమలయ్య, కోశాధికారి లక్కారం పోశెట్టి, ఆర్మూర్ సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు దోండి నారాయణ వర్మ, కార్యదర్శి గంగాధర్, జిందం నరహరి పాల్గొన్నారు.

పట్టణ పద్మశాలి సంఘ నూతన కార్యవర్గం

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని 8 తర్పల పద్మశాలి సంఘాలతో ఏర్పడిన పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల రమాకాంత్, కోశాధికారిగా బత్తుల భాస్కర్, సర్వసమాజ్ ప్రతినిధిగా కొక్కుల విద్యాసాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోహన్‌దాస్ మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవుల సంక్షేమం కోసం పాటుపడతామని, నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ భవనం పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ త్రివేణి గంగాధర్, చిట్ల ప్రకాష్, హరిచరణ్, చౌకే లింగం, అంబల్లా శ్రీనివాస్, అనంత్‌రావు, యఘ్నేష్, సైబ సుధాకర్, రుద్ర రాజేశ్వర్, రేగుల్ల ప్రకాష్, దాసరి సునీల్ పాల్గొన్నారు.

నవీపేటలో 55.6 మి.మీ. వర్షపాతం

నవీపేట,జూలై27(ఆంధ్రజ్యోతి): నవీపేట మండలంలో ఆదివారం 55.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్లు నమోదైందని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని నాళేశ్వర్‌లోని పటేల్ చెరువు, కమలాపూర్‌లోని కొచ్చెరువు పూర్తిగా నిండి మత్తడి పోస్తుందని అధికారులు పేర్కొన్నారు. మండలంలో 91చెరువులు ఉండగా సగానికి పైగా చెరువులలోకి భారీగా నీటి ప్రవాహం పెరిగింది.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



చాంద్‌పాషా(ఫైల్)

భిక్కనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపలి తండాకు చెందిన చాంద్ పాషా(28) గజ్వేల్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చాంద్‌పాషా 20 రోజుల క్రితం గల్ఫ్ దేశం నుంచి రాగా వ్యక్తిగత పనినిమిత్తం గజ్వేల్‌కు బైక్‌పై వెళ్తుండగా అదేవైపు వెళ్తున్న క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా అర్ధరాత్రి మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు గజ్వేల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం చేసేది లేదని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు బీష్మించు కు కూర్చున్నారు. చాంద్‌పాషా మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతుడికి తల్లిదండ్రులు సైదబీ, చిన్న సిలాబ్, సోదరుడు బాబా ఉన్నారు.

పొతంగల్‌లో కంకర లారీ బోల్తా



పొతంగల్ చెక్‌పోస్టు వద్ద బోల్తా పడిన కంకర లారీ

కోటగిరి,జూలై27(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు అదుపు తప్పి కంకర లారీ బోల్తా పడింది. బీర్కూర్ మండలం నుంచి కంకర నింపుకుని కోటగిరి మండలం ఎత్తొండ వైపు వస్తున్న కంకర లారీ పొతంగల్ చెక్‌పోస్టు వద్ద మలుపు తిరిగే క్రమంలో ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో రెండు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెను ప్రమాదం తప్పడంతో అంత ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివారు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఇల్తెపు శంకర్ దంపతులు

ఎడపల్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి రెండుకళ్ల లాంటి వారని వారిలో ఎవరు లేకున్నా ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని బోధన్ ఎమ్మెల్యేసుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాలులోఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు ఇల్తెపు శంకర్ స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారికి విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశ అభివృద్ధికి పాటు పడుతారన్నారు. ఇల్తెపు శంకర్ దాదాపు నలభై సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూనే ఎన్నో సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొని సామాజానికి ఎంతో సేవ చేశారని ఆయన కొనియాడారు. స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసినా సమాజసేవను కొనసాగించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఇల్తెపు శంకర్ మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా పలు పాఠశాలలో పని చేసి నేడు స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందడం బాధగా ఉందన్నారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదన్నారు. నేను ఈనలభై ఏళ్లపాటు నా ఉపాధ్యాయ వృత్తిలో నాతోటి ఉపాధ్యాయులకు గాని ఎవరికైనా నావల్ల ఇబ్బంది కలిగితే నన్ను క్షమించాలన్నారు. ఉద్యోగ సమయంలో నాకు ఎల్లప్పుడూ నా కష్ట సుఖాలకు తోడుగా ఉన్న నాభార్యకు ప్రత్యేక దన్యావాదాలు అన్నారు. నా వృత్తిలో ఒడిదుడుకుల సమయంలో నాకు సహకరించిన నా అన్నదమ్ములకు, కుటుంబీకులకు, సహ ఉద్యోగులకు ప్రత్యేకంగా దన్యావాదాలు తెలిపారు. అనందరం ఆయనను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు దాదన్నగారి విఠల్ రావు, కామారెడ్డి జిల్లా కుషాల్, జిల్లా ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

చిరుత పులి పాదముద్రల పరిశీలన



సిరన్‌పల్లి శివారులో చిరుత పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నవీపేట,జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరన్‌పల్లి శివారులో ఆదివారం చిరుత పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల గ్రామ శివారులో చిరుత పులి సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం గ్రామ శివారులో ఉన్న మామిడి తోట వద్ద చిరుత పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. చిరుత పులికి సుమారు రెండు సంవత్సరాల వయసు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. చిరుత పులి సంచరించే ప్రాంతానికి ఎవరు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. సిరన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన వారిలో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ జహూర్, బీట్ ఆఫీసర్ సుధీర్‌లు ఉన్నారు.

ఆగస్టు 5న జెండా జాతర

ఆర్మూర్‌టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద బజార్ జెండా బాలాజీ మందిరంలో ఆగస్టు 5న జెండా జాతర నిర్వహిస్తున్నట్లు సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, కార్యదర్శి పడాల్ దినేష్‌లు తెలిపారు. ఆదివారం జెండా బాలాజీ మందిరంలో జెండా కట్టెకు పూజలు నిర్వహించి జెండా బాలాజీ మందిరం నుండి కింది బజార్, గోల్‌బంగ్లా మీదుగా జంబిహనుమాన్ ఆలయానికి జెండాను తీసుకువచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోల్ బంగ్లా, పెద్దబజార్ మీదుగా జెండా బాలాజీ మందిరంలో జెండాను ప్రతిష్ఠించారు. 9 రోజులు పూజలు అందుకుని జాతర నిర్వహించిన అనంతరం జాతరను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జెండా బాలాజీ మందిర పూజారులు మధుకశర్మ, మనోహర్ శర్మ, సర్వసమాజ్ సభ్యులు, కులసంఘాల పెద్దమనుషులు, అధ్యక్ష కార్యదర్శులు , ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లగుట్ట, గన్యాతండాలో ఘనంగా తీజ్



జక్రాన్‌పల్లి మండలం నల్లగుట్ట తండాలో తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జక్రాన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్ట తండా, గన్యతండా గ్రామాల్లో ఆదివారం తీజ్‌పండుగ వేడుకలను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.గతకొన్నేళ్ల నుంచివస్తున్న సాంప్రదాయ ప్రకారం పెళ్లికాని యువతులు గోదుల మొలక బుట్టలను ఎత్తు కున్నారు. ఇరు గ్రామాల్లో యువతులు గోధుమ బుట్టలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం స్థానిక చెరువులో గోధుమబుట్టమొలకలను నిజామజ్జనం చేశారు. పెళ్లికాని యువతులు గోధుమ మొలక బు ట్టలను ఎత్తుకుని తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొంటే మంచి భర్త వస్తాడని వారి నమ్మకం. తీజ్ పండగ పాటలు పాడుకుంటు, నృత్యాలు చేస్తు ఈ తీజ్ పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజార బేరి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్, శీను నాయక్, మెహన్ నాయ్, తాండా పెద్దలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తు దృశ్యం

రెంజల్,జూలై27(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రానికి చెందిన లబ్దిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను ఆధ్వర్యంలో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అర్హులకు రేషన్ కార్డులు అందలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన రేషన్ కార్డులే ఉన్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల రేషన్ కార్డులు అందించలేదన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రేషన్ కార్డులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, కాంగ్రెస్ పార్టీ మహిళ మండల అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, అసాని అనిల్, శివ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్

ఆలూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ మండలంలో, మండలానికి సంబంధించిన పరిసరా గ్రామాలలో వర్షపాతం అధికంగా ఉండడం వల్ల వాగులు కాలువలు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులకు కూడా ఇంటి వద్దనే ఉంచుకోవాలని బయటకు పంపితే ఉరుములు, మెరుపులతో ప్రమాదం పొంచి ఉందని, కరెంట్ పోల్స్ విద్యుత్ తీగల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇళ్లు కూలే పరిస్థితి ఉంటే అధికారులను సంప్రదించాలని వారికి పునరావాస కేంద్రాలు కల్పిస్తామని తెలిపారు. అత్యవసరమైన పరిస్థితులు వస్తే తప్ప ప్రజలు బయటకు వెళ్ళవద్దని సూచించారు.

'రైల్వేలైన్‌లకు నిధులు కేటాయించాలి'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్‌లకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పత్రిక ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్పా కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల సందర్భంగా ధర్మపురి అర్వింద్ హామీ ఇచ్చారని ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, కొండ గంగాధర్, నాగరాజు, జక్కం సుజాత, ఓంకార్, కుల్దీర్ శర్మ, రాజు పాల్గొన్నారు.

దోమకొండ కుంటలో ఇద్దరి గల్లంతు

●ఒకరి మృతదేహం లభ్యం ● మరొకరి కోసం గాలింపు



లభ్యమైన శివాని మృతదేహం

దోమకొండ, జూలై27 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్నటువంటి కుంటలో రెండు మృతదేహాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం ఇద్దరు మహిళలు కుంట వద్ద బట్టలు ఉతకడానికి వెళ్ళినట్లు సమాచారం. ప్రమాదవశాత్తు ఇద్దరూ కుంటలో పడిపోవడంతో శివాని (22)అనే మహిళ మృతదేహం నీటి పైకి తేలడంతో ఆమెను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. మరో మృతదేహం అందులో ఉందా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వారు ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గుడిసెలు వేసుకొని చిత్తు కాగితాలను, పాత ప్లాస్టిక్ బాటిల్లను మూట కట్టుకొని ఉంటున్నారని సమాచారం. ఈ విషయమై ఎస్సై స్రవంతిని వివరణ కోరగా కుంటలో నుంచి ఒక బాడీ తీరడంతో పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించడం జరిగిందని ఆమె తెలిపారు.

పురాణిపేట్‌లో వైద్య శిబిరం



పురాణిపేట్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

భీమ్‌గల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాణిపేట్ గ్రామంలో ఆదివారం శ్రీ శివసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వందమంది చిన్న పిల్లలకు , సుమారు నాలుగు వందల పెద్దలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఉదయం ఎనిమిది గంటలకు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.సాయికుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ భీమ్‌గల్ లో ఆసుపత్రి ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. వైద్యులు సూర్యనారాయణ, జైపాల్, ప్రదీప్తి, అనిల్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సుంకరి నడిపి గంగాధర్, శ్రీరామ్, బానుచందర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో శ్రమదానం



ముళ్ల పొదలు తొలగిస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఆలయ ఆవరణ, పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్, క్యారీబ్యాగ్‌ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీలావణ్య, శంకర్, రాజన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, మధుసుదన్, గణేష్, రవీందర్, కృషివర్ధన్, నరేందర్, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

పాలెంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్

మోర్తాడ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణం పూర్త యితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుం దని అన్నారు. భవన నిర్మాణానికి బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు బక్కురి ఆనంద్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు మహిపాల్, రంజిత్, నవీన్, స్థానిక నాయకులు ఏనుగు మోహన్, బ్రహ్మానాయుడు, రవిశంకర్, రాజన్న, నరేష్, గ్రామ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పురోహితులు రంజిత్ శర్మ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్

మోర్తాడ్,జూలై 27(ఆంధ్రజ్యోతి):మం డల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కళాశాల పరిధిలో సీఈసీ గ్రూప్‌లో మిగిలి ఉన్న సీట్లను భర్తీచేయ డం జరుగుతుందని ప్రత్యేకాధికారి స్వప్న తెలిపారు. ఈఅవకాశాన్ని అందరు సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకొని స్పాట్ అడ్మిషన్‌కు రావాలని కోరారు.

చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి

రుద్రూరు,జూలై27(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నెలకు రూ.10వేలు వేతనం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. రూ.10వేలు వేతనంతో పాటు నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈ నెల 28న సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1గంటలకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రవీందర్, మధ్యాహ్న భోజన కార్మికులు సాయిలు, లక్ష్మి, అల్మాస్, రవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



దేవాచారిని సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వేల్పూర్ మండలం సంతోషి మాత కాలనీ ప్రభుత్వ పాఠశాల కు చెందిన దేవాచారిని నిజామాబాద్ బస్వాగార్డెన్‌లో సన్మానించారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని 32 మండలాల నుంచి ఒక్కో మండలం నుంచి ఒక ఉపాధ్యా యుడిని చొప్పున ఎంపిక చేశారు. అందులో వేల్పూర్‌కు చెందిన సంతోష్ మాత కాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన దేవచారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ మెమెంట్‌తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు కే.రవిచందర్, కార్యదర్శి అజ య్, తపస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమ్‌గల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహత్‌నగర్‌లో ఇటీ వల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రైతు ధారవత్ రామ్‌సింగ్ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల వివరాలను తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, కుంట రమేష్, అనంత్‌రావు, నాగేంద్రబాబు, సుంకరి సురేష్, గోపాల్ నాయక్, రాజు పాల్గొన్నారు.

బంజార నాయకులకు సన్మానం



స్వాగతం పలుకుతున్న బంజార నాయకులు

జక్రాన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజార సేవక్ సంగ్ జాతీ అధ్యక్షుడు ఉమేష్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్‌కు ఆదివారం బంజారా బేరీ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌లో జరిగే సమావేశానికి వస్తున్న ఉమేష్‌యాదవ్, రాములు నాయక్‌కు డిచ్‌పల్లి టోల్‌గేట్ వద్ద బంజార బేరి జిల్లా అధ్యక్షుడ సంతోష్ నాయక్, మోతీలాల్ నాయక్ కలిసి వారికి స్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువ, మెమెంటుతో సత్కరించారు.

ఆర్మూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆర్మూర్ టౌన్, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2013-14 సంవత్సరపు పదవ తరగతి విదార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు.పాఠశాలకు తమవంతుగా సీసీ కెమెరాలతో పాటు వైఫైని సమకూర్చడానికి ముదుకు వచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గణేష్, కోకిల నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఆశ్వక్‌మహ్మద్, విజయ్‌ప్రకాష్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, శ్రీదేవి, అపర్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడలో ట్రా'ఫికర్'

- ప్రధాన రహదారిపైనే ఇష్టానుసారంగా పార్కింగ్
- సిగ్నల్ వ్యవస్థ ఉన్నా.. ప్రయోజనం సున్నా
- కనీస నియమాలు పాటించని వాహనదారులు
- పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

బాన్సువాడటౌన్ , జూలై 27(ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణ ప్రజలకు ట్రా...ఫికర్ పట్టుకుంది. ప్రధాన రహదారి మొదలుకొని గల్లీల్లో చూసినా ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. దీనికి గల కారణం కేవలం వాహనదారులు ఇష్టారీతిన తమతమ వాహనాలను పార్కింగ్ చేయడమేనని స్థానికులు పేర్కొంటున్నారు. వాస్తవానికి అప్పటి స్పీకర్ , ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృషితో బాన్సువాడ పట్టణ రహదారులు, కాలనీ దారులు విశాలంగా మారాయి. బాన్సువాడ - కామారెడ్డి, బాన్సువాడ - బోధన్ రహదారులు డివైడర్ ఏర్పాటుతో పాటు వాహనాల పార్కింగ్ కోసం అధికారులు ఎల్లో మార్కింగ్ కూడా చేసి ఉంచారు. కానీ వాహనదారులు కనీస నిబంధనలు పాటించకపోవడం , వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు మరింత జఠిలమవుతోంది.

బ్యాంకుల వద్దే అధిక ట్రాఫిక్ సమస్య

బాన్సువాడ పట్టణంలో ప్రధానంగా బ్యాంకుల వద్దే ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. బాన్సువాడ - కామారెడ్డి రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు , బాన్సువాడ - తాడ్కోల్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంకు మరో బ్రాంచి , బాన్సువాడ - పాతబాన్సువాడ రోడ్డులో యూనియన్ బ్యాంకు , హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకులలో లావాదేవీలు జరిపేందుకు విచ్చేసిన ఖాతాదారులు తమతమ వాహనాలను క్రమంలో పార్కింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బాన్సువాడ - కామారెడ్డి ప్రధాన రహదారి సగం వరకు వాహనాలతో నిండిపోగా ఇతర హనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా పాతబాన్సువాడ రోడ్డులో కూడా వాహనాలను



రెడ్‌సిగ్నల్ ఉన్నా వాహనాల రాకపోకలు ఇలా



బాన్సువాడ ప్రధాన రహదారిపై వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో కూలిన డివైడర్

సగం రోడ్డు వరకు వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు బస్టాండ్ వెనకాల గల ఎన్జీవోస్ కాలనీ వెళ్లే దారిలో సైతం వాహనాల పార్కింగ్ తలనొప్పిగా మారుతోంది.

కనీస నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి..

కనీస నియమాలను పాటించకుండా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న వారిపై సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రతీ రోజు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని , ఇష్టారీతిన పార్కింగ్ చేసిన వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా బ్యాంకుల వద్ద వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయకుండా అవగాహన కల్పించాలన్నారు.

సిగ్నల్ వ్యవస్థ ఉన్నా.. ప్రయోజనం సున్నా!

బాన్సువాడ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు రెడ్ సిగ్నల్ ఉన్నా కూడా యధేచ్ఛగా సిగ్నల్ జంప్ చేస్తున్నారు. ఫలితంగా ఇతర మార్గాల వైపు వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాన్సువాడ బస్టాండ్ ప్రాంతంతో పాటు తాడ్కోల్ చౌరస్తాలో కూడా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని , ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

ఫ్రీ లెఫ్ట్‌కు దారేది ..?

బాన్సువాడ బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి పాతబాన్సువాడ వైపుకు వెళ్లాలంటే ఫ్రీ లెఫ్ట్‌కు దారిలేకుండా పోయింది. ఎడమ వైపుకు వెళ్లాలంటే గ్రీన్‌సిగ్నల్ పడేంత వరకు వేచి చూడాల్సిందే. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు , ప్రజలు కోరుతున్నారు.

వరి నాట్లు వేసేందుకు పక్క జిల్లాకు మహిళా కూలీలు

- ఉదయాన్నే వాహనాల్లో పయనం
- ఒక్కో కూలీకి రూ.800 నుంచి వెయ్యి సంపాదన
- కురుస్తున్న వానలకు కూలీలకు పెరిగిన డిమాండ్

పెద్దకొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత పక్షం రోజుల వరకు వానలు కురియకపోవడంతో వ్యవసాయ పనులు నిదానంగా సాగాయి. నీటి లభ్యత కలిగిన ప్రాంతాలలోనే పనులు ఉండటంతో కూలీలకు పనులు అంతంత మాత్రంగానే ఉండేవి. అయితే గత నాలుగైదు రోజుల నుంచి వానలు కురియడంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. దీంతో వరినాట్లు వేసేందుకు మహిళా కూలీలకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. కామారెడ్డి సంగారెడ్డి జిల్లాకు సరిహద్దులో ఉండటంతో మహిళా కూలీలకు నాట్లు వేసేందుకు మన జిల్లా రైతులతో పాటు సంగారెడ్డి జిల్లా రైతుల నుంచి పిలుపు రావడంతో మహిళలు నాట్లు వేసేందుకు కామారెడ్డి జిల్లా గ్రామాలతో పాటు, పక్కనున్న సంగారెడ్డి జిల్లా గ్రామాలకు వెల్తున్నారు. ఉదయం వివిధ రకాల వాహనాలలో పనులకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకుంటున్నారు.

గుత్తగా కూలీ పనులతో ఆదాయం..

మామూలు సమయంలో అయితే మహిళా కూలీలు ఉదయం నుంచి



నాటు వేసేందుకు ఆటోలో వెళ్తున్న కూలీలు



పొలంలో నాటు వేస్తున్న మహిళా కూలీలు

సాయంత్రం వరకు కూలీ పనిచేస్తే సుమారుగా 3 వందల నుండి 4 వందల వరకు కూలీ చెల్లిస్తారు. ప్రస్తుతం కూలీలకు డిమాండ్ ఉండటంతో వరి నాటు పనులను గుత్తాగా చేస్తున్నారు. ఎకరాకు 4500 నుండి 5 వేల రూపాయలు తీసుకుని వరి నాట్లు వేస్తున్నారు. దీంతో 15 మంది మహిళ కూలీలు రోజంతా 3 నుండి 4 ఎకరాల వరకు వేయడంతో ఆటో కిరాయి పోను ఒక్కొక్కరికి సుమారుగా 8 వందల నుండి 1 వెయ్యి రూపాయల వరకు కూలీ గిట్టుబాటు అవుతుందని కూలీలు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తేనే కూలీ బాగా వస్తుందని తెలిపారు.

మొన్నటి వరకు పక్క జిల్లాలోనే పనులు..

గత వారం రోజుల కిందట వరకు నాట్లు వేసే పనుల కోసం కూలీలు ఉదయాన్నే సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలతో పాటు, నారాయణ ఖేడ్, సిర్గాపూర్, కంగ్టి మండలాలకు వెల్లేవారు. మన జిల్లాలో సరియైన వర్షం లేకపోవడంతో పక్క జిల్లాకు పనుల కోసం ఆటోలలో వెల్లారు, ప్రస్తుతం వానలు కురస్తుండటంతో మన జిల్లాలోనే పనులు దొరుకుతున్నట్లు కూలీలు తెలిపారు. గతంలో కంటే మన జిల్లాలోనే పనులు దొరుకుతుండటంతో ఇతర జిల్లాకు వెల్లడం లేదని తెలిపారు. వానలు లేక వరినాట్లు ఇంకా జోరుగా సాగడం లేదని మరిన్ని వర్షాలు కురిస్తే తమకు నెల రోజుల పాటు ఉపాధి లభిస్తుందని కూలీలు తెలిపారు.

నాట్లు వేసేందుకు సంగారెడ్డి జిల్లాకు వెలుతున్నాం

లల్లిబాయి, రూం తండా..



మేము గత కొద్ది రోజుల నుంచి వరినాట్లు వేసేందుకు సంగారెడ్డి జిల్లాకు వెలుతున్నాం. మన జిల్లాలో సరైన వర్షాలు లేని కారణంగా పక్క జిల్లాలో నీరు లభ్యత ఉన్న ప్రాంతాల్లో నాట్లువేసేందుకు వెళ్తున్నాం. ఉదయాన్నే 6 గంటలకు ఇంటి నుంచి బయలు దేరి పనులకు వెళ్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు నాట్లు వేసే పనిని గు త్తగా చేయడంతో కూలీ సుమారుగా వెయ్యి వరకు వస్తుంది. ఆటో కిరాయి పోను మాకు కూలీ మిగులుతుంది.

ఇక్కడ పనులు లేక పక్క జిల్లాకు పనులకు వెళ్లాం..

శారదా బాయి, రూం తండా



మన జిల్లాలో పనులు లేని కారణంగా పక్క జిల్లాకు పనులకు వెళ్లాం. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మన జిల్లాలోనే పనులు దొరుకుతున్నాయన్నా నమ్మకం కల్గింది. భారీ వర్షాలు కురిస్తే మన జిల్లాలోనే ఇంక వరి నాట్లు పనులు నెల వరకు సాగుతాయి. దీంతో మాకు ఉపాధి లభిస్తుంది. మంచి వర్షాలు కురియాలని కో రుకుంటున్నారు.

వీధి శునకం.. ప్రజలకు నరకం

- రుద్రూరు మండలంలో కుక్కల స్వైరవిహారం
- కానరాని నియంత్రణ చర్యలు
- ప్రజలపై కుక్కల దాడి



వీధి కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి

రుద్రూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో రోడ్లమీద ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తూ గ్రామస్థులపై దాడులకు దిగుతున్నాయి. గ్రామస్థులు భయాందోళనలకు గురవుతూ ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఆసుపత్రుల్లో కుక్కకాటుకు బాధితులు నానాటికి ఎక్కువుతున్నారు. వీధి కుక్కలకు నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం, టీకాలు వేయాల్సి ఉన్న ఆ చర్యలు కనపడడం లేదు. రుద్రూరు మండలంలోని 10 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది వ్యవధిలోని దాదాపు 60మంది కుక్కకాటుకు గురయ్యారంటే గ్రామాల్లో కుక్కల బెడద ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రుద్రూర్ మండల కేంద్రంలోని దాదాపుగా 20మంది కుక్కకాటుకు గురయ్యారు. అంబం(ఆర్)02, సులేమాన్ ఫారం 05తో పాటు రాణంపల్లి, అక్బర్‌నగర్, బొప్పాపూర్, చిక్కడ్‌పల్లి గ్రామాల్లో కుక్కకాటుకు గురయ్యారు. రుద్రూర్‌లో గతంలో పిచ్చికుక్క ఏడుగురు వ్యక్తులను కరిచింది. దీంతో పాటు పశువులపై కూడా దాడి చేసింది. సోమవారం రుద్రూర్ మండల కేంద్రంకు చెందిన ఓ వ్యక్తికి కుక్కకాటు వేసింది. దీంతో కుక్కకాటుకు గురైన బాధితులు గగ్గోలు పెడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లే వ్యక్తులపై కూడా వెనకాల నుండి వచ్చి కుక్కలు దాడి చేయడంతో ప్రజలు జంకుతున్నారు. అంబం(ఆర్) గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో కలిసి తిరుగుతున్నాయి. ఒంటరిగా ఎవరైనా కనబడితే చాలు దాడులు చేస్తున్నాయి. గతంలో ఆయా గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో కుక్కలను హతమార్చినప్పటికి ఇంకా కుక్కల బెడద తగ్గడం లేదు. ఇప్పటికైన వీధి కుక్కలను నియంత్రించి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.



రుద్రూర్‌లో కుక్కల స్వైర విహారం

వ్యాక్సిన్ వేస్తున్నాం: రుద్రూర్ పశువైద్య అధికారి సంతోష్

ఆసుపత్రికి తీసుకొచ్చే పెంపుడు కుక్కలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేస్తున్నాం. వీధి కుక్కలకు వ్యాక్సిన్ ఇవ్వాలంటే కుక్కలను పట్టే వారు ఉండాలి. వీధి కుక్కలకు వ్యాక్సిన్ ఇవ్వడం కుదరడం లేదు. ఆసుపత్రికి తీసుకొచ్చే కుక్కలకు మాత్రం వ్యాక్సిన్ ఇస్తున్నాం. వ్యాక్సిన్ ఇచ్చిన కుక్క కరిచిన ఎలాంటి సమస్యలు రావు.

ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేదెన్నడో?

- ఆర్థిక భారం మోయలేక ముందుకు రాని లబ్ధిదారులు
- ఒకేసారి పెద్దమొత్తంలో ఇళ్లు మంజూరు కావడంతో మేస్త్రీలకు డిమాండ్

సదాశివగనర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం వేచి చూసిన అనేకమంది లబ్ధిదారులకు ఆదిలోనే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం అందించే రూ.5లక్షలు విడతల వారీగా అందుతాయన్న ఆశతో కొందమంది ముంఉదకు కదలనీయక ఆశ వదులుకోలేక అయోమయంలో పడే పరిస్థితి తలెత్తుతుంది. మండలానికి 564 గృహాలు మంజూరు కాగా 257 గృహాలకు మాత్రమే మార్కింగ్ ఇవ్వడం జరిగింది. 106 గృహాలు బేస్మెంట్ వరకు నిర్మాణం చేపట్టి నిలిచిపోయాయి. ప్రయోగాత్మకంగా చేపట్టిన వజ్జేపల్లిలో ఒక వంద పైచిలుకు గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 8గృహాలు మాత్రమే స్లాబ్ వరకు నిర్మాణాలు జరిగాయి. కేవలం నాలుగు గృహాలు మాత్రమే స్లాబ్ వేయడం జరిగింది. దీనిని బట్టి చూస్తే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ఎంత కష్టంగా మారిందో గృహాల నిర్మాణాల పరిస్థితి చేస్తేనే అర్థమవుతుంది. పూర్తిస్థాయిలో నిర్మాణాలు ఎప్పుడు జరుగుతాయో అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.



వజ్జేపల్లిలో స్లాబ్ పూర్తయిన ఇల్లు

లబ్ధిదారుల అసలు కష్టాలు..

ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల కకోసం రూ.5లక్షలు మంజూరు చేసి మండలంలోని 564మంది లబ్దిదారులకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇల్లు ప్రారంభించాలంటే బేస్మెట్ వరకు దాదాపు రూ.6నుంచి 7లక్షల వరకు ముందుగా పెట్టాల్సి ఉంటుంది. మండలంలో ఒకేసారి గృహాలు మంజూరు కావడంతో మేస్త్రీలకు డిమాండ్ పెరగడంతో ఒక్కో గృహానికి రూ.3లక్షల వరకు మేస్త్రీలకే చెల్లించాల్సి రావడం, ప్రభుత్వం బేస్మెట్ వరకు పూర్తికాగానే రూ. లక్ష అందించిన దాదాపుగా రూ.5 లక్షల వరకు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మొత్తం ఇంటి ఖర్చు రూ.15లక్షల నుండి రూ.20లక్షల వరకు అవుతున్న ప్రస్తుతం ప్రభుత్వం అందించే రూ.5లక్షలు పోనూ మిగితా డబ్బులను లబ్దిదారులు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దింతో ఇల్లు నిర్మించుకోవాల లేక అప్పుల పాలు కావాలా అనే అయోమయంలో అనేకమంది లబ్దిదారులు పడిపోతున్నారు.

గూడు లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తే లబ్ధిదారులకు మేలు..

పూర్తిగా ఇల్లు లేక నిర్మించుకునే స్తోమత లేని పేద కుటుంబాలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తే పేద వారు మరింత అప్పుల పాలు కాకుండా ప్రభుత్వం కాపాడుతున్నట్లు అవుతుందని అనేకమంది లబ్దిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తే డబ్బులు లేక బయట నుంచి వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి ఇల్లు నిర్మించుకుంటే మూలిగే నక్క పై తాటికాయ పడ్డ చందంగా పే దోళ్ల బతుకులు అవుతాయని అ యోమయం వ్యక్తం చేస్తున్నారు. 564గృహాలకు గానూ దాదాపు 12 మాత్రమే నిర్మాణ దశలో ఉండట మే దినికి ఉదాహరణగా చెప్పుకోవచ్చని లబ్దిదారులు అభిప్రాయపడుతున్నారు.

మండలకేంద్రంలో నిర్మిస్తున్న నమూనా గృహం ఇప్పటికీ అసంపూర్తి..

మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహం చేపట్టి రూ.5లక్షలతో ఇల్లు పూర్తి అవుతుందని లబ్దిదారులకు భరోస నింపడానికి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోఏర్పాటు చేసిన ఇల్లు ఇప్పటివరకు పూర్తికాకపోవడం లబ్దిదారులన ఉమరింత ఆందోళనకు గురిచేస్తుంది. నూతన సాంకేతిక విధానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఒక్కో గ్రామంలో అన్ని ఇండ్లను కలిపి ఓకే కాంట్రాక్టర్‌కు ఇప్పించాలన్న ఆలోచన ఉన్నప్పటికీ ఆ ఇల్లు పూర్తికాక గ్రామాలలోని లబ్ధిదారులకు అవగాహన కల్పించలేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ముందుకు సాగడం లేదన్నది లబ్ధిదారులు వేధిస్తున్న ప్రశ్న.



పూర్తి కానీ ఇందిరమ్మ ఇల్లు నమూనా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్నిరకాల అవగాహన కల్పిస్తున్నాం.. - ఎంపీడీవో సంతోష్‌కుమార్



లబ్దిదారులకు అన్నిరకాల సూచనలు చేస్తూ ఇళ్ల నిర్మాణం కోసం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నాం. 257ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేయడం జరిగింది. లబ్దిదారులకు సరసమైన ధరలకు అందించడానికి ఇసుక కాంట్రాక్టర్లతో సంప్రదింపులు జరుపుతై లబ్దిదారులకు అందే విధంగా కృషిచేస్తున్నాం. సమీప వాగుల నుంచి ఇసుక రవాణాకు తహసీల్దార్‌తో మాట్లాడి ఆ విధంగా కూడా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలన్న ఆలోచనతో ఉండటం వల్ల నిర్మాణాలు జాప్యం అవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈవలు ప్రత్యేక పర్యవేక్షణలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నాం.

అలంకార ప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

మోర్తాడ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా, అలంకార ప్రాయంగా మారాయి. గ్రామీణ ప్రాంతంలోని యువతను క్రీడల్లో తీర్చి దిద్దడానికి, వారి నుంచి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వీటిని ఏర్పాటు చేశారు. మోర్తాడ్‌లోని దోన్‌పాల్ రోడ్డు, గోవింద్‌రెడ్డి కాలనీ వద్ద మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. కాగా పనులు మాత్రం జరగలేదు. ఈ పథకం జాతీయ ఉపాధిహామి నిధుల కింద చేపట్టారు. మండలంలోని తొమ్మిది గ్రామాలలో రూ. 8లక్షల 49వేలతో ఈ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మైదానాలు మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ క్రీడా మైదానంలో మొక్కలు, చెట్లు పెరిగాయి. క్రీడా ప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల యువకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మోర్తాడ్‌లోని గోవింద్‌రెడ్డి కాలనీలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం కొనుగోలుచేసిన భూమి ఉండడంతో అదే స్థలంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. క్రీడా మైదనాలలో ఖోఖో, వాలిబాల్ ఇతర ఆటల కోసం ఏర్పాటు చేయాలి. అంతేకాక వ్యాయమం చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలి. ఇలాంటివేమి ఏర్పాటు చేయకపోవడం వల్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. నామమాత్రంగా భూమిని చదును చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన ఈ క్రీడా ప్రాంగణాలను పట్టించుకొని క్రీడలు ఆడేందుకు అన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.



మోర్తాడ్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని యువకులు కోరుతున్నారు.

గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి..

-డి.శ్యాం, ఫిజికల్ డైరెక్టర్,జడ్పీహెచ్ఎస్, మోర్తాడ్




గ్రామాలలోని యువకులు క్రీడల పట్ల ఆసక్తి కలిగించేందుకు అవకాశాలు కల్పించాలి. వారి నుంచి నైపుణ్యాన్ని వెలికితీయాలి. ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తే జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీసుదర్శన మహాయజ్ఞం

నిజామాబాద్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా లోకమంతా సుభిక్షంగా ఉండాలని లోక కల్యాణార్థం శ్రీవేద భారతి పీఠ సంస్థాపకుల ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత లక్ష్మి సుదర్శన మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్ ఎస్‌వీఐ కాలనీలో నిర్వహించిన మహాయజ్ఞంలో ఉదయం వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో గోపూజ, పుణ్యాహవాచన, విశ్వక్‌సేన, గణపతి, గౌరీ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన పూజలు నిర్వహించి సంప్రోక్షణం చేశారు. వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలతో యాగశాల ప్రవేశం చేసి మంఠప ఆరాధన, కలశ స్థాపన, యంత్ర ప్రతిష్ట, అగ్నిప్రతిష్ఠ, నవగ్రహ నక్షత్ర శ్రీరుద్ర సహిత లక్ష్మి సుదర్శనయాగం, జయాది హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవేద భారతి పీఠ సంస్థాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, గురుచరణ్, తదితరులు పాల్గొన్నారు.

రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రిక

పెద్దకొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎవరైనా తమ ఇంట్లో వివాహ కార్యక్రమం నిర్వహిస్తే వివిధ రూపాలలో పెండ్లి పత్రికలు అచ్చువేసి బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. ఈ పత్రికలు మొదటి పేజీలో దేవతల రూపంలో లేదా ఇతర రంగులలో ముద్రించి పత్రికలను పంచుతారు. అయితే దీనికి భిన్నంగా ఆలోచించి తన కుమారుడి పెండ్లి పత్రికలు గాయత్రీ రామాయణ పుస్తక రూపంలో ముద్రించారు పిట్లం మండల కేంద్రానికి చెందిన కోట నాగరాణి- రాజులు దంపతులు. తమ కుమారుడి పెండ్లి ఆగష్టు నెలలో ఉన్నందున వివాహానికి రావాలని రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రికలు ముద్రించి వివాహానికి రావాలని బంధు, మిత్రులను ఆహ్వానిస్తున్నారు. గత రెండు సంవత్సరాల కిందట కూడ రాజులు తన కూతురి వివాహం చేసే సమయంలో భగవద్గీత పుస్తక రూపం లో పత్రికలు అచ్చు వేయించారు. ఈ విషయంపై కోట రాజులను ప్రశ్నించగా కార్డుల రూపంలో పెండ్లి పత్రికలు అచ్చు వేయిస్తే వాటిని చూసిన అనంత రం ఎవరైనా పక్కన పెడతారని, అలా కాకుండా ఈ విధంగా భక్తికి సంబంధించిన పుస్తక రూపంలో అచ్చువేయిస్తే పత్రిక చూడటంతో పాటు తమకు నచ్చిన సమయంలో భక్తిపుస్తకాలను చదువుతారనే ఉద్దేశ్యంతో రామాయణ రూపంలో పెండ్లి పత్రికలు అచ్చువేయించడం జరిగిందని తెలిపారు.



గాయత్రీ రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రిక



పుస్తకం మొదటి పేజీలో లిఖించిన పెండ్లి పత్రిక

తపస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

● హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిస్వార్థంగా పనిచేసే వర్గం అని కొనియాడారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేయడానికి ముందుంటానని తెలిపారు. అనంతరం కేజీబీవీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, బట్టు భద్రీనాథ్, రాష్ట్ర బాధ్యులు రామకృష్ణారెడ్డి, కీర్తి సుదర్శన్, గాండ్ల వరప్రసాద్, కర్నెశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిసర ప్రాంతాలకు రావొద్దు: తహసీల్దార్



వాటర్‌ఫాల్‌ను సందర్శించిన తహసీల్దార్ వెంకట్రావ్

ఇందల్వాయి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సిర్నాపల్లి, నల్లవెల్లి సరిహద్దులో గల శీలం జానకీబాయి చెరువు వాటర్ ఫాల్ ఉద్రిక్తిత తీవ్రంగా ఉన్నందున వరద ఉద్రిక్తిత తగ్గేంతవరకు చెరువు వాటర్‌ఫాల్ పరిసర ప్రాంతాలకు ఎవరూ రావొద్దని తహసీల్దార్ వెంకట్రావ్ సూచించారు. ఆదివారం ఎస్సై సందీప్‌తో కలిసి తహశీల్దార్ వెంకట్రావ్ శీలం జానకీబాయి చెరువు వాటర్‌ఫాల్‌ను సందర్శించారు. పై నుండి వరద నీరు వేగంగా వస్తుందని దీంతో వాటర్‌ఫాల్ సందర్శనకు వచ్చే వారికి పలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. శనివారం వాటర్‌ఫాల్ వాగులో ముగ్గురు గల్లంతు అయిన విషయం తెలిసిందే. వరద ఉద్రిక్తిత దృష్ట్యా వాటర్ ఫాల్ పరిసర ప్రాంతాలకు చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు రాకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ గాయత్రీ యజ్ఞం



గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):శ్రావణమాసాన్ని పురస్కరించుకొని విశ్వగాయత్రీ యజ్ఞ సమితి ఆధ్వర్యంలో శ్రావణ గాయత్రీ యజ్ఞం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆదివారం నగరంలోని సాయికృపనగర్ కాలనీలో నిర్వహించిన యజ్ఞంలో సుదర్శనముని పౌరహిత్యంలో సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి, వంశీ, కృష్ణవేణి యజ్ఞ క్రతును చేశారు. ఈ సందర్భంగా విశ్వ గాయత్రీ యజ్ఞ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ శ్రావణ మాసం పవిత్రమైన మాసం కావడంతో కాలుష్య నివారణ వాతావరణ శుద్ధితో పాటు లోకకళ్యాణం కొరకు గాయత్రీ యజ్ఞం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనర్సయ్య, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

తండాలో తీజ్ పండుగ



గోధుమల బుట్టలతో యువతులు

ఇందల్వాయి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని స్టేషన్ తాండా, మేగ్యానాయక్ తండాలలో ఆదివారం గ్రామస్తులు తీజ్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. నవధాన్యాలతో కూడిన విత్తనాలను ఒకబుట్టలో 9 రోజుల పాటు నానబెట్టి ఉపవాస దీక్షలతో పెళ్లికాని యువతులు నీళ్లుపోసి మొలకెత్తిన అనంతరం బుట్టలను నెత్తిన ఎత్తుకొని నృత్యాలు, కోలాటాల మధ్య ఊర చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఈ తీజ్ పండుగలో పిల్లలు, వృద్ధులు సైతం బంజారా సాంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో తాండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ధర్పల్లిలో 2008-09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ధర్పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):ధర్పల్లి మండల కేంద్రంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి విచ్చేసిన గురువులకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దాదాపు 16 సంవత్సరాల సుదీర్ఘకాలం అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు ఏం చేస్తున్నారో అనే విషయాలను అడిగి తెలుసుకొని ప్రతియేటా ఇలాగే కలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, జయలక్ష్మి, సాబేర్ అలీ, రాజేందర్, రామ్మోహన్‌లను సన్మానించారు. ఇర్ఫాన్, శ్రావణ్, మహిపాల్, శేఖర్, రమేష్, క్రాంతిలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు సరే.. మురుగు కాల్వల నిర్మాణం ఎక్కడా?

- టీటీడీసీ చుట్టూ పక్కల కాలనీలో రోడ్లలపై మురుగు
- కాల్వల నిర్మాణం లేక రోడ్డు పై పారుతున్న మురుగు
- పట్టించుకోని ఘన్‌పూర్ పంచాయతీ అధికారులు



టీటీడీసీ ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

డిచ్‌పల్లి,జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్ గ్రామ పరిధిలోని టీటీడీసీ చుట్టూ పక్కల కాలనీలపై గ్రామ పంచాయతీ అధికారులు చిన్నచూపు చూస్తున్నరని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.పన్నుల్లు ముక్కు పిండి వసూళ్లు చేస్తున్న అధికారులు కనీసం కాలనీలో మురుగు కాల్వలు నిర్మాణం చేయడం లేదని రోడ్డుపై అడ్డంగా మురుగు ప్రవహిస్తుందని దీంతో వాహన దారులకు కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని పేర్కొంటున్నారు. కాలనీ రోజురోజుకు విస్తరిస్తుంది. చుట్టూ పక్కల నుంచి చాలా గ్రామాల వాళ్లు ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు దీంతో నూతన భవనాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. ఘన్‌పూర్ గ్రామానికి శివారులో దూరంగా ఉండటం, ఇక్కడే స్థానికేతరులు అధికంగా ఉండటంతో గ్రామ పంచాయతీ అధికారులు చిన్నచూపు చూస్తు అభివృద్ధిని విస్మరిస్తున్నరని ఆరోపనాలు ఉన్నాయి. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ లు ఇచ్చే ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి కార్యాలయం, మరియు టీటీడీసీ కార్యాలయాలు ఉన్న, ఇక్కడికి తరుచూ ఉన్నతాధికారులు వస్తంటారు. అయిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నూతన భవంతులతో సిటీలాగా ఉన్న కాలనీలో మౌళి సదుపాయాలు లేక దుర్గంధం వెదజల్లుతుంది. సీసీ రోడ్లు లేక వర్షకాలంలో రోడ్లన్ని బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు దూరం దూరం ఉండటంతో తరుచూ విద్యుత్ సమస్యలు అదే విధంగా కనీసం తాగు నీటి సదుపాయం గ్రామ పంచాయతీ అధికారులు కల్పించాలేదు. ఇక్కడ కుళాయి ఏర్పాటు దేవుడెరుగు కనీసం మంచినీళ్లు అందించ డానికి ఒక్క బోరు కూడా కనబడకపోవడం గమానార్హం. ఇప్పటికైనా జిల్లా, మండల ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

'టూవీలర్ మెకానిక్‌ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'



డిచ్‌పల్లిలో నూతన కమిటీ ప్రమాణం చేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న టూ వీలర్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారాలకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టూవీలర్ మెకానిక్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ టూ వీలర్ మెకానిక్‌ల అసోసియేషన్ ఇందల్వాయి,డిచ్‌పల్లి మండలాల టూ విల్లర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయి బ్రహ్మణులకు ఇచ్చిన విధంగా 2వీలర్ మెకానిక్‌లకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18రకాల అసంఘటిత కార్మిక రంగ వర్గాల్లో మెకానికులను గుర్తించకపోవడం శోచనీయమన్నారు. మిగతా కార్మికులకు అమలు చేస్తున్నట్లుగా మెకానిక్‌లకు రూ.5లక్షల ప్రమాద భీమా, వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ సౌకార్యం కల్పించాలన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలో సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన డిచ్‌పల్లి, ఇందల్వాయి కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడుగా అమృత్‌పూర్ గంగాధర్, మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు ముల్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అజీస్, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, గంగాధర్, జాయింట్ సెక్రటరి గా మనోజ్, దాసు, కోశాధికారిగా చక్రల భాస్కర్, శ్రీనివాస్, లీగల్ అడ్వజైరి గా రాజేందర్‌రెడ్డి, మాణిక్ రాజ్ , ఆర్గనైజర్ లుగా కల్యాణ్, సుమన్ తో పాటు 14 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కామారెడ్డి అధ్యక్షుడు కిరణ్, బాన్సువాడ అధ్యక్షుడు రవి, బిచ్కుంద అధ్యక్షుడు అబ్బస్,నాయకులు వాసుబాబు, ధర్మగౌడ్, పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మరణానికి కారుకులైన ఇద్దరి అరెస్టు



యువకుని మరణానికి కారుకులైన లాయక్‌ను అరెస్టు చేసిన పోలీసులు

సిరికొండ,జూలై 27(ఆంధ్రజ్యోతి):సిరికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామ శివారులో గల ఆయిల్ కుంట వద్ద శుక్రవారం లభించిన గుర్తు తెలియని యువకుడి మరణానికి కారుకులైన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ధర్పల్లి సీఐ బిక్షపతి,సిరికొండ ఎస్సై జాడి రామకృష్ణ తెలిపారు. ధర్పల్లి సీఐ బిక్షపతి,సిరికొండ ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. కరీంనగర్‌జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటకు చెందిన ఖాజమొయినొద్దిన్(43)న్ మరణానికి కారుకులైన అతని బావమర్ది ఆర్మూర్‌కు చెందిన షేక్‌లాయక్ అలియాస్ బబ్లూ,అబ్దుల్ జబ్బార్‌లను అరెస్టు చేసిరిమాండ్‌కు తరలించారు. షేక్ లాయక్ అక్కను 13ఏళ్ల క్రితం ఖాజమొయినొద్దిన్‌కు ఇచ్చి పెళ్లి చేసిన తర్వాత అతను ఆర్మూర్‌కు వచ్చి బావమర్ది షేక్‌లాయక్ వద్ద సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని ఎస్సై తెలిపారు. గత కొంత కాలంగా ఖాజమొయినొద్దిన్ తన అక్కను వేధిస్తూ తరచు కొట్టుచున్నాడని షేక్‌లాయక్ చెప్పాడని ఎస్సై వివరించారు. ఈ నెల 23న రామన్నపేట్ గ్రామంలో సెంట్రింగ్ పనిచేసే చోట ఖాజమొయినొద్దిన్ పురుగుల మందు తాగగా అక్కడే ఉన్న మృతుని బావమరిది షేక్‌లాయక్ అలియాస్ బబ్లూ వాడు చస్తేనే తన అక్కా ప్రశాంతంగా ఉంటుందని మృతుడిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా అతని చావుకు కారణమయ్యాడని ఎస్సై వివరించారు. లాయక్ మరొక కార్మికుడు అబ్దుల్ జబ్బర్‌తో కలిసి సిరికొండ ఏరియాలో దట్టమైన ప్రాంతాలు ఉంటాయని భావించి ఇక్కడ పడేస్తే ఎవరు గుర్తు పట్టరని మోటర్ బైక్‌పై తీసుకొచ్చి పడేశారని ఎస్సై తెలిపారు. షేక్‌లాయక్,అబ్దుల్ జబ్బర్ ఆయిల్‌కుంట వద్దకు శవాన్ని తీసుకొచ్చి కనపడకుండా శవం పైన చెట్ల కొమ్మలు విరిచి పడేశారని ఎస్సై వివరించారు. ఈ విషయాన్ని వారిద్దరు అంగీకరించారని ఆయన తెలిపారు..కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించి నిందితులను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. నమ్మదగిన వారి సమాచారం ఆధారంగా నిందితులను ముచ్కూర్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఖాజమొయినొద్దిన్ చావుకు కారణమైన షేక్ లాయక్‌ను, అబ్దుల్ జబ్బర్‌ను ముచ్కూర్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జాడి రామకృష్ణ తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఖలీల్‌వాడిలో పేకాట స్థావ రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆధివారం మెరుపుదాడి చేశారు. ఓ మెడికల్ ఏజెన్సీ లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి ఐదు గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 5వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు కోసం 1వ టౌన్ పోలీసులకు అప్పగించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయిచైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయని లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. చెరువుల కింది భాగంలో మత్తడి నీరు పారుతున్నందున అటువైపు ప్రజలు వెళ్లకుండా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. విద్యుత్ తీగలు తెగినచోట దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను సుదూర ప్రాంతాలకు పంపకుండా ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత పోలీస్‌లకు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల కోసం నిర్విరామంగా కృషి చేయడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ నేత ఆకుల మహేందర్ నిజామాబాద్ 1వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రేవంత్‌రెడ్డిపై రాజకీయ కక్షతో ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలు సృష్టించి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని తెలిపారు.ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు సోషల్‌మీడియాలో తప్పుడు కథనా లు ప్రచారం చేస్తున్నాడని అన్నారు. సీఎం పరువుకు భంగం కలిగే విధంగా తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్న కౌశిక్‌రెడ్డిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని కోరారు.

మునిపల్లిలో కుక్కల బెడద

● గత రెండు రోజుల్లో 40 మందిని గాయపర్చిన వీధికుక్కలు

జక్రాన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):జక్రాన్‌పల్లి మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుంది. గత రెండు రోజులుగా మండలంలోని మునిపల్లి గ్రామంలో పిచ్చి కుక్కలు గ్రామస్తులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. గత రెండు రోజులుగా 40 మందిని వీధి కుక్కలు గాయపర్చగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారు ప్రస్తుతం ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కుక్కలు రెచ్చిపోయి దాడులు చేసే అవకాశం ఉందని గ్రామ ప్రత్యేక అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే కుక్కలు కరుస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా వాటిని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారుడికి నిత్యావసర సరుకుల పంపిణీ

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):సీనియర్ పెయింటింగ్ కళాకారుడు బ్రహ్మకు తోటి కళాకారులు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మ స్వగృహంలో ఆదివారం 8వేల రూ పాయల విలువ గల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పెయింటింగ్ కళాకారుడు కృష్ణస్వామి చిత్రపటానికి నివాళుల ర్పించారు. పెయింటింగ్ కళాకారులుగా సం వత్సరాల తరబడి పనిచేస్తున్న కళాకారులను ప్రభు త్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కిషన్, మహాదేవన్, చారి, లింబూరి లక్ష్మణ్, వేణు, సాయి బాబా,శ్రీను,శెట్టి, చందు, గంగాధర్, హన్మాండ్లు, రాజు, బలవీర్, గణేష్, రాజ్‌కుమార్, దేవ, రవి పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న కళాకారులు

బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం చేయూత



భీమ్‌గల్‌లో బీడీ కార్మిక సంక్షేమ స్థానిక నిధి దావఖానా

భీమ్‌గల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఉపకార వేతనాలు(స్కాలర్‌షిప్) అందిస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన విద్యార్థులు ఉపకార వేతనాలు పొందే అవకాశం ఉంది. బీడీ 2025-26 విద్య సంవత్సరానిఇక దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలి. బీడీ కార్మికుల విద్యార్థులు చదువులో రాణించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ చేయుతను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

● విద్యను బట్టి ఉపకార వేతనాల వివరాలు

1వ తరగతి నుండి 4వ తరగతి వరకు 1000 రూపాయలు, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 2000 వేల రూపాయలు, ఇంటర్మీడియట్ కు 3000 వేల రూపాయలు, డిగ్రీ, ఐటీఐ, ఇతర ప్రొఫెసర్ కోర్సులకు 6000 వేల రూపాయల ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. దరఖాస్తు చేసుకోవడానికి తేదీ, ప్రీ మెట్రిక్(1వ తరగతి నుండి 10వ తరగతి వరకు) ఆగస్టు 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పోస్ట్ మెట్రిక్(ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ అలాగే ప్రొఫెషనల్ కోర్సులు చదివే వారికి అక్టోబర్ 31లోపు దరఖాస్తులను డబ్లుడబ్లుడబ్లు స్కాలర్‌షిప్. గవర్నమెంట్ ఇన్ అనే వెబ్సైట్ లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పీఎఫ్ ఐడీ కార్డు తప్పనిసరి అలాగే విద్యార్థుల పేరు మీద బ్యాంకు ఖాతాలు ఉండాలి. గత సంవత్సరం మార్కుల మెమో జత చేయాలి. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధృవీకరణ పత్రం అవసరం ఉంటుంది. నెలకు కనీసం పదివేల ఆదాయం మించి ఉండరాదు. బీడీ కార్మికులకు ఇద్దరు పిల్లలు కలిగి ఉంటే ఉపకార వేతనాలకు విడివిడిగా బ్యాంకు ఖాతాలు తెరచి దరఖాస్తు చేసుకోవాలి. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో నేరుగా ఉత్తీర్ణత సాధించిన వారే అర్హులు. సప్లిమెంటరీ పాస్ అయిన వారు అనర్హులు. అలాగే దూర విద్యనభ్యసించే వారికి కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలు పొందుటకు పీఎఫ్ఐడీ కార్డు ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్త చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని, ఏమైనా సందేహాలు ఉంటే భీమ్‌గల్ పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలనీలో ఉన్న బీడీ కార్మిక సంక్షేమ నిధి ఆసుపత్రిలో సంప్రదించాలని లేదా హెల్ప్ లైన్ నెంబర్ 040-25561297 కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.

ఎం. గంగాధర్ (బీడీ కార్మిక సంక్షేమ నిధి స్థానిక మరియు సంచార దవఖానా సీనియర్ ఫార్మసిస్ట్), భీమ్‌గల్

ఆవుపాల పంపిణీ పోస్టర్ల ఆవిష్కరణ



ఆవుపాల పంపిణీ పోస్టర్ల ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోకుల్ గోసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఆవుపాల పంపిణీ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం పండుగను పురస్కరించుకొని ఉచితంగా నగరంలోని 70 కేంద్రాలలో ఆవుపాలను అందించనున్నట్లు తెలిపారు.పలు గ్రామాలలో సైతం ఆవుపాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీధర్, దయాకర్, సతీష్, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహాన్ని నింపిన విన్‌స్పైర్

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడమే కాకుండా విద్యపట్ల ఆసక్తి కలుగుతుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విన్‌స్పైర్ సాంస్కృతిక కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.230	రూ.280	రూ. 300



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,00,500	రూ.92,700	రూ.1190

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 :ది ఫెంటాస్టిక్-4 (తెలుగు) (10.25)
: సయ్యారా (హిందీ) (1.00)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (4.10)
:హరిహర వీరమల్లు (7.00, 10.20)
స్క్రీన్-2 : హరిహర వీరమల్లు (9.40, 1.00, 4.20, 7.40, 11.00)
స్క్రీన్-3 : హరిహర వీరమల్లు (11.05)
: మహావతార్ నర్సింహా (2.25, 7.50)
: ది ఫెంటాస్టిక్-4 (ఇంగ్లీష్) (5.15, 10.40)
స్క్రీన్-4 : సైయ్యారా (హిందీ) (10.20, 1.30, 4.40, 7.50, 11.00)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1:హరిహర వీరమల్లు (1.25, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2:హరిహర వీరమల్లు (11.00)
:మహావతార్ నరసింహా (1.55)
: సయ్యారా(హిందీ)(4.30, 7.30, 10.30)
స్క్రీన్-3:మహావతార్ నరసింహా (11.00, 4.30, 7.30, 10.30)
: సయ్యారా (హిందీ) (1.30)

దేవి: జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: హరిహర వీరమల్లు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ది ఫెంటాస్టిక్-4 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్